# రూ. 1,725/- విలువయిన కైనెటిక్ మిక్సీ బహుమతికి అర్హమైన కథ

## లవ్ ఎట్ బస్ స్టాప్

-సత్యశ్రీ సంపత్ కుమార్

బస్‌స్టాప్‌లో రోజూ ఎందరో అమ్మాయిల్ని చూస్తున్నాడు కానీ ఆ అమ్మాయిలా ఇంకెవరూ అతన్ని ఆకర్షించలేకపోయారు. చంద్రునిలా అందమైన ముఖబింబం, కాస్త ఎత్తుగా నవ్వినప్పుడు బయటికి కన్పించే ముత్యాల్లాంటి పలువరుస, మెర్క్యూరీ లైటు కాంతిలో పాలు కారుతున్నట్టు నునుపైన చెక్కిళ్ళు, బస్సులు వచ్చి ఆగుతుంటే వాటితో వచ్చే చిరుగాలికి నుదురుపై అలవోకగా కదలాడే ముంగురులు. లైట్ పింక్ కలర్ చుడీదార్‌లో కుడి భుజానికి అందమైన హ్యాండ్ బ్యాగ్‌తో ఆ అమ్మాయి నడుస్తుంటే సాలార్‌జంగ్ మ్యూజియంలో పాలరాతి శిల్పం 'రెబక్కా' నడిచి వచ్చినట్లు అన్పిస్తుంది కిరణ్‌కి.

ఒకరోజు ... అదే బస్‌స్టాప్ ... ఆ అమ్మాయిని చూస్తూ నిలబడి వున్నాడు.

సరిగ్గా అదే సమయంలో ... కీచుమని శబ్దం చేస్తూ సరాసరి ఆ అమ్మాయి నిలబడ్డ నాలుగు గజాల ముందుకొచ్చి ఆగింది ఓ రెడ్ కలర్ హీరోహోండా.

"హాయ్ వసూ... కమాన్..." స్టైల్ కళ్ళాద్దాలలోంచి చూస్తూ అన్నాడు ఆ బైక్‌వాలా, కామెడీ సినిమాలో సైడ్ జోకర్‌లా బక్కపలచగా వున్నాడు. ఇంకాస్త క్లియర్‌గా పోల్చాలంటే జొన్నచేలో పెట్టిన దిష్టిబొమ్మను గుర్తుకుతెస్తున్నాడు. కాకపోతే ఆ స్టైల్ కళ్ళజోడుతో మాడ్రన్ దిష్టిబొమ్మలా వున్నాడు.

ఆ అమ్మాయి గబుక్కున వెళ్ళి అతని వెనక కూర్చుంది. ఆ దిష్టిబొమ్మ కుర్రాడు ఇకిలిస్తూ ఏదో మాట్లాడుతూ గేరుమార్చి ఆక్సిలేటర్ పెంచాడు. బైక్ కదలడానికి ముందు 'వసూ' కిరణ్‌కేసి ఓసారి ఓరగా చూసింది. వల ఎత్తుకు ఎగిరిపోతున్న పావురాల్ని చూసి బోయవాడుఎంత ఉక్రోషంతో కాలిపోయాడో సరిగ్గా కిరణ్ పరిస్థితి కూడా ఇప్పుడు అదే స్థితిలో వుంది.

* * *

కాలం మామూలుగానే గడుస్తుంది. ప్రతిరోజూ కిరణ్ ఆ బస్‌స్టాప్‌లో ఆమెని చూస్తూనే వున్నాడు. ఆమెను చూస్తున్న రోజు రోజుకీ ఆమెపై ప్రేమ, ఆకర్షణ అంతకంతకీ పెరుగుతూనే వుంది.

అప్పుడు టైం పావుతక్కువ ఎనిమిదైంది. కానీ రోజులాగ వసూ ఇంకా బస్టాప్‌కి రాలేదు. కిరణ్‌కి అసహనంగా అనీజిగా ఒకింత ఉక్రోషంగాను వుంది. అప్పుడే దూరంగా వస్తూ కనిపించింది వసు. అంతే!! అప్పటివరకు వున్న అన్నిరకాల అవస్థలు దూరమై మనసు ఉప్పొంగిన సముద్రంలా సంతోష కెరటాలతో ఎగసిపడింది. ఈరోజు మరింత అందంగా ఏషియన్ పెయింట్స్‌తో వైట్ పేపర్ మీద గీసిన అందమైన ఇంద్రధనస్సులా మెరిసిపోతోంది.


చిరునవ్వుతో వచ్చి కిరణ్‌కి కొద్ది దూరంలో నిల్చుంది. ఓసారి సూటిగా వసూ కళ్ళలోకి చూశాడు. చెరగని చిరునవ్వుతో పలకరింపుగా కళ్ళెగరేసింది. అంతే... ఆ అవకాశాన్ని వృధా చెయ్యదల్చుకోలేదు. వెంటనే అటుకేసి వెళ్తున్న ఓ ఖాళీ ఆటోను పిల్చాడు. నాలుగడుగులు ముందుకేసి వసూ ముందుకెళ్ళి నిల్చున్నాడు.

"మీరెళ్ళాల్సిన బస్సులు వెళ్ళిపోయాయి. మీకు అభ్యంతరం లేకపోతే ... నాతోపాటు ఆటోలో రండి. నేను మీ స్టేజీ దాటి వెళ్తాను" కంఠం వణకకుండా కాస్త కష్టపడ్డాడు కిరణ్.


క్షణకాలం తటపటాయించి "ఓ ... కె ... పదండీ" అంటూ ఆటోకేసి నడిచింది.

ముందు వసూని కూర్చోనిచ్చి తరువాత తను కూర్చున్నాడు. చిన్న జర్క్‌తో ఆటో కదిలింది. దాంతో పాటే కిరణ్ ఆలోచనలూ ముందుకు కదిలాయి.

'ఇప్పుడేం చెయ్యాలి...? ఇప్పుడేం




KINETIC MARKETING ASSOCIATES
7-65, A. Wing, Adj. Petrol Pump, Hyderabad-500 007. ✆ 853397




ప్రేమకు ప్రామిసరీ
నోటులు వుండవు;
సాక్షి సంతకాల
ప్రమేయం వుండదు.
ప్రేమ అంటే నమ్మకం – ఒకరిపట్ల మరొకరికి.
అంతకుమించి రీజనింగ్‌ని మనసు ముంగిటకు
రానివ్వని భావన మాత్రమే!

వసూ మామూలుగా చిరునవ్వుతో రోడ్డుమీది ట్రాఫిక్‌ని గమనిస్తోంది. ఆమెకు అదేం కొత్తగా అన్పించడంలేదు. కావాలనే ఆరోజు లేటుగా వచ్చింది. ప్రస్తుతం ఆమె ఆలోచనలనిండా అతనే. 'ఏం చేస్తాడు? ఎలా ప్రొసీడ్ అవుతాడు??'

"ఆటో... ఆపు...!" సడన్‌గా అరిచాడు. ఆటో రోడ్డుకి ఓ ప్రక్కగా ఆగింది. వెంటనే ఆటోలోంచి దిగాడు కిరణ్. పాకెట్‌లోంచి ఇరవై రూపాయల నోటు తీసి డ్రైవర్‌కిస్తూ వెళ్ళిపొమ్మని సైగ చేశాడు. అతని వెనకాలే వసూ కూడా క్రిందికి దిగింది. ఆటో వెళ్ళిపోయింది. ఆమె ఏదో అనబోయింది. కానీ అంతలోనే

"నేను ఇలా అడుగుతున్నందుకు మరోలా భావించకండి. మీకు అభ్యంతరం లేకపోతే ... అలా ... ఓ పదినిమిషాలు ఆ పార్క్‌లోకి వెళ్దాం ... మీతో కొంచెంసేపు మాట్లాడాలి...!?" సీరియస్‌గా ఒకింత ఉద్వేగంతో అభ్యర్థనాపూర్వకంగా అడిగాడు.

అతని ధైర్యానికి ఆశ్చర్యపోతూ... బయటికి కాస్త భయపడుతున్నట్లు నటిస్తూ అతన్ని అనుసరించింది.

చాలా అందంగా చూడడానికి మనోహరంగా కన్పిస్తుంది ఆ పార్క్. జనం ఎక్కువగా లేరు. ఉన్నవాళ్ళు జంటలుగానే వున్నారు. ప్రస్తుతం వాళ్ళెవరూ బాహ్య ప్రపంచంలో లేరు. కాస్త మసగ్గా వున్న ఓ ప్రదేశంలో ఓ పొద ప్రక్కన ఆగారు.

క్రింద పచ్చగడ్డి. పాలలాంటి వెలుతురులో మంచు పీచులా మెరుస్తూంది. రిలాక్స్‌డ్‌గా కూర్చున్నాడు కిరణ్.

"కూర్చో వసూ..." అతనికి కలలో జరుగుతున్నట్లు అన్పిస్తూంది.

"చెప్పండి... నన్నెందుకు ఇక్కడికి తీసుకొచ్చారో..." ఆమె నిలబడే తీవ్రంగా అంది. ఆమె అలా అంటుందని ముందే ఊహించిన కిరణ్‌కి సమాధానం కష్టమేమీ అన్పించలేదు.

"ఎందుకో ... ఇప్పటికి అర్థం చేసుకున్నారని అనుకుంటున్నాను"

"అంటే ... ?!?" ఇంకాస్త గొంతు తీవ్రత హెచ్చింది.

"ఒక అబ్బాయి ఒక అందమైన అమ్మాయిని ఇలా పార్క్‌కి ఆహ్వానించాడంటే ... అందులోని అర్థమేంటో మీకు తెలియదా?"

ఆమెకు ఆటో ఎక్కుతున్నప్పుడే తెలుసు ఇలా జరుగుతుందని. లోలోన

సంతోషంగా వున్నా కావాలనే బెట్టు చేస్తూంది.

"అంటే ... నన్ను ప్రేమిస్తున్నారా ...!"

"అవును వసూ ... ఐలవ్యూ ... ఐలవ్యూ టూ మచ్ ..." తన్మయత్వంగా అన్నాడు.

"నువ్వు ప్రేమిస్తే ... నాకేంటి ...?" ఆమె పిచ్చి ప్రశ్నకు అదిరిపడ్డాడు.

"నేను ప్రేమిస్తుంది ఆరాధిస్తుంది నిన్నే ... నిన్నే వసూ."




"ఐతే మాత్రం ... నేను మిమ్మల్ని ప్రేమిస్తున్నానో ... లేదో ... మీకు అవసరం లేదా?"

"ఉంది ... అందుకేగా నిన్ను ఇక్కడికి తీసుకువచ్చింది. ఇప్పుడు చెప్పు నన్ను ప్రేమిస్తున్నావా? ప్రేమించగలవా? ... 'నువ్వెవరూ ...?' 'నిన్నెందుకు ప్రేమించాలి?" అని నువ్వు అడగొచ్చు అందుకే చెప్తున్నాను ...

నిన్ను చూసినప్పటి నుండి నేనెవరో నేనే మర్చిపోయాను. నా స్థానంలో నిన్ను చేర్చుకొని నిన్నే ప్రేమిస్తున్నాను. ఇక ... నువ్వు నన్నెందుకు ప్రేమించాలి అంటే ...? నేను నిన్ను నా దేవతగా నా సర్వస్వంగా పూజిస్తూ ఆరాధిస్తూ మనస్ఫూర్తిగా ప్రేమిస్తున్నాను గనక నువ్వు తప్పనిసరిగా నన్ను ప్రేమించాలి." ప్రశ్నలూ సమాధానాలు అతనే చెప్పేసి ఓసారి వసు కళ్ళలోకి సూటిగా చూశాడు.

అతని వాగ్ధాటికి బిత్తరపోయి చూస్తూంది వసు.

మళ్ళీ కిరణ్ అన్నాడు – "చూడు ... వసూ ... జీవితాన్ని ప్రాక్టికల్‌గా మలుచుకోవాలన్నది నా ఆశయం. అందులో భాగంగానే నిన్ను ప్రేమించి పెళ్ళి చేసుకోవాలనుకుంటున్నాను. జీవితంతో రాజీపడటం నాకు ఇష్టంలేదు. అలాగని బలవంతంగా నన్ను ప్రేమించమనడం లేదు. నీ నిర్ణయం వారం రోజుల్లో తెలియజేయవచ్చు. ఇంటికి వెళ్ళి బాగా ఆలోచించు ..." అంటూ లేచాడు.

కానీ అప్పటికే ఆమెలోని స్త్రీ హృదయం కరిగి ప్రేమామృత ప్రవాహమై అది ఆమెలో నిలువలేక చటుక్కున అతని మీద వాలిపోయింది.

* * *

బాబూ కిరణ్,

దీవెనలతో మీ నాన్న వ్రాయునది త్వరలో మాఘమాసం రాబోతుంది. ఇక్కడ మీ మామయ్య గొడవ పెడుతున్నాడు. ఏనాటినుండో అనుకుంటున్న విషయమే... వచ్చే నెల మొదటి వారంలోనే నిశ్చయ తాంబూలాలు మార్చు కుందామని నేనూ మీ మామయ్య నిర్ణయించుకున్నాం. సమయం ఎక్కువగా లేదు. కనక ఈ లెటర్ చూడగానే అశ్రద్ధ చేయక బయలుదేరి రాగలవు.

ఇట్లు
మీనాన్న
రఘురామయ్య

ఆరోజు పోస్ట్‌లో వచ్చిన లెటర్ చదివాక కిరణ్ మనసు అల్లకల్లోలం అయ్యింది. మామయ్య కూతురు సుమలత తీగలా కోలముఖంతో కవ్వింపు గానే వుంటుంది. కానీ ... సిటీ అమ్మాయినే తన జీవిత భాగస్వామిగా చేసుకోవాలని సిటీకొచ్చిన కొత్తలోనే గట్టిగా నిర్ణయించుకున్నాడు. అంతేగాక




ప్రస్తుతం వసూతో ప్రేమలో గొంతువరకు దిగిపోయాడు. ఎలాంటి పరిస్థితు ల్లోనూ వసుకి ద్రోహం చెయ్యలేదు. అదికాక వసూని చూడకుండా ఒక్కరోజు కూడా వుండలేకపోతున్నాడు. అది తన జీవిత సమస్య. అందుకే రాత్రంతా ఆలోచించి ఓ నిర్ణయానికొచ్చాడు. 'పెళ్ళంటూ చేసుకుంటే వసూనే.'

"వసూ .. ఈజ్ ద పార్ట్‌నర్ ఆఫ్ మై లైఫ్ ..." మనసులో ఖచ్చితంగా అనుకొని ఏ తెల్లవారుజామునో నిద్రపోయాడు.

* * *

కిరణ్ రోడ్డుమీద నడుస్తూన్నవాడల్లా ఒక్కసారిగా ఆగాడు. అతని దృష్టి రోడ్డు ప్రక్కగా వున్న బార్ మీద పడింది. అప్పుడే లోపలికెళ్తున్న ఓ బక్కపలుచని ఆకారం చూడగానే సడన్‌గా గుర్తొచ్చింది. కాసేపు ఆలోచించి బార్‌లోకెళ్ళాడు. కిరణ్ వెళ్ళేసరికే ఆ వ్యక్తి గ్లాసులోకి బీరు వంపుకుంటున్నాడు. అక్కడ వెలు తురు డిమ్‌గా వుంది. వెస్ట్రన్ మ్యూజిక్ సన్నగా విన్పిస్తుంది. సరాసరి అతని టేబిల్ ముందుకెళ్ళి ఎదురుగా వున్న ఖాళీ సీట్లో కూర్చున్నాడు. ఓసారి ఆ ఆకారం కిరణ్‌కేసి విసుగ్గా చూసింది. ఇక ఆలస్యం చెయ్యదల్చుకోలేదు.

"హలో ... అయాం కిరణ్ ..."

"అయాం మోహన్ ..." చెయ్యి అందిస్తూ ఆశ్చర్యంగా చూశాడు.

"నేనెవరో మీకు తెలియదు. కానీ మీరు నాకు గుర్తు. ఒక ముఖ్యమైన ఇన్ఫర్మేషన్‌కోసం మిమ్మల్ని గుర్తుపట్టి వచ్చాను." క్లుప్తంగా మోహన్ కళ్ళలోకి చూస్తూ అన్నాడు.

"నాకేం అర్థం కావటంలేదు ...?" సంశయంతో మధ్యలోనే ఆగిపోయాడు.

"మిస్టర్ మోహన్. కొన్ని రోజుల క్రితం మీరు కోఠి బస్టాప్‌లో వసూ అనే ఒక అమ్మాయిని మీ బైక్ మీద తీసుకెళ్ళారు ... గుర్తుందా ...? ఆవిడ మీకేమవుతారు ...?"

"ఆ విషయం మీకెందుకు ...? అసలు మీరెవరు ...?" ఎదురుప్రశ్న వేశాడు మోహన్. అతనలా రియాక్ట్ అవుతాడని కిరణ్‌కి ముందే తెలుసు.

"నేను ఆ అమ్మాయిని ప్రేమిస్తున్నాను... ఆఫ్‌కోర్స్ ఆ అమ్మాయీ నన్ను ప్రేమిస్తోందనుకో ..."

క్షణకాలం నిశ్శబ్దం. ఆ తరువాత మోహన్ బిగ్గరగా నవ్వాడు.

అతను అలా ఎందుకు నవ్వుతున్నాడో కిరణ్‌కు ఏమాత్రం అర్థం కాలేదు.

"ఎందుకలా నవ్వుతున్నారు...?" వస్తున్న కోపాన్ని తమాయించుకొని అడిగాడు.

"ఇప్పుడు నీకేమవుతుందో కొద్ది రోజులక్రితం నాకూ అదే అవుతుంది."

కమ్చీతో కొట్టినట్టు అదిరిపడ్డాడు కిరణ్.

"అంటే ... ?!?"

"మొన్నటి వరకూ నేనూ వసూని ప్రేమించాను."

"అంటే ... ఇప్పుడు మానేశారా ...!"

మరోసారి బిగ్గరగా నవ్వాడు మోహన్. అతను అలా నవ్వుతుంటే పీకపిసికి చంపాలన్నంత కోపం వస్తోంది కిరణ్‌కు.

"మిస్టర్ కిరణ్ ... అదో తిరుగుబోతు. నన్ను ప్రేమించేకంటే ముందే ఎందరితోనో దానికి సంబంధం వుంది. అది తెలిసే నేను వదిలేశాను. నా

అవసరం నేను తీర్చుకున్నాను."

కిరణ్ గుండెనెవరో పట్టి పిసుకుతున్న ఫీలింగ్. ఇంకో క్షణం అక్కడ వుండా లనిపించలేదు. వెనుదిరిగి వస్తుంటే "బెస్టాఫ్ లక్ ..." అంటున్న మోహన్ మాటలు వినిపించాయి.

* * *

"వసూ .. ఒకటడుగుతాను. నిజం చెప్తావా ... ?!?"

"మైడియర్ ... కిర్రూ ... నేను నీతో అబద్ధం చెప్తానా!" అంటూ చిలిపిగా మునిపంటితో అతని చెవి కొసను కొరికింది. అప్పటికే వాళ్ళ శరీరాలు అలిసిపోయి సేదతీర్చుకుంటున్నట్లుగా అలాగే బెడ్‌మీద ఒకరి కౌగిల్లో ఒకరు ఒదిగిపోయి వున్నారు.

"మన పరిచయానికి ముందు ఓ రోజు ఒక బక్కపలుచని వ్యక్తి నిన్ను బస్టాప్ నుండి హోండా మీద తీసుకెళ్ళాడు. అతనెవరు...?" సింపుల్‌గా అడిగాడు.

ఆ ప్రశ్న వినగానే ఆమె గుండె వేగం రెట్టింపవడం, ఆమె ఎత్తైన వక్షస్థలంలో మార్పురావడం గమనించాడు.

"ఓ ... వాడా ... వాడొట్టి రౌడీ వెధవ ... మా కాలనీలోనే వాడి ఇల్లు. మా నాన్నతో ఎలాగో పరిచయం చేసుకున్నాడు. ఆ నెపంతో పెద్ద ఫోజుకొడుతూ ... వచ్చి బైక్ ఎక్కమన్నాడు. నాకు ఇష్టం లేదు. కాని, బస్టాపులో చూపుల్తోనే నన్ను తినేసేట్టు చూసే నిన్ను ఉడికించడానికి, నిన్ను రెచ్చగొట్టడానికి అతడి ఆహ్వానాన్ని అంగీకరించాను. అయినా ఇప్పుడెందుకు అంత ప్రత్యేకంగా అడుగుతున్నావు - నా మీద ...?!"

"ఛ... ఛ... అలాంటిదేం లేదు. ఊర్కే ... అడిగానంతే ..." అంటూ ఆర్తిగా ముద్దుపెట్టుకుని "అలా అడిగినందుకు నన్ను క్షమించు" అన్నాడు.

అప్పుడే చిత్రమైన ఆలోచన మొలకెత్తింది కిరణ్ మదిలో!

ముక్కు మొహం తెలియని మగవాడు బస్ స్టాప్‌లో.అబగా చూపి నందుకు మనసు పారేసుకున్న మగువ ఆమె-

ఓ మగాడ్ని రెచ్చగొట్టడానికి మరో మగాడి మోటారుసైకిల్ ఎక్కిన ఆడిపిల్ల ఆమె-

తాను ఆటో పిలిచి ఎక్కమనగానే ముందూ వెనుకా చూడకుండా ఆటోలో తన పక్కన కూర్చున్న వ్యక్తి ఆమె-

'ఐ లవ్యూ' అనగానే పార్క్‌లో తన గుండెల మీద వాలిపోయిందీ ఆమే-

'నిన్ను ప్రేమిస్తున్నాను' అనగానే గదికొచ్చింది; పెళ్ళి చేసుకుంటాను- అనగానే అన్నీ అర్పించిందీ ఆమే!

తనతో ఎన్నో సాయంత్రాలు ఎక్కడెక్కడో గడిపిన ఆమె తన ఇంట్లో వారికి ఏవేవో కట్టుకథలు చెప్పింది.

కన్నవార్ని- పెంచినవార్ని కట్టుకథలతో మోసం చేసిన ఆమె తనని మాత్రం కాకమ్మ కబుర్లతో మభ్యపెట్టడం లేదని నమ్మకమేమిటి?

పెళ్ళికి ముందే మగాడికి అన్నీ అర్పిచిన ఆమె తాళికి ఇచ్చే విలువ ఎంత?

ఆమెతోనా తాను జీవితాన్ని పంచుకోవలసింది?

"కిరణ్ ఎప్పుడెళ్తున్నావ్ ఊరికి ..." వసు అడగడంతో ఆలోచనల్లోంచి బయటపడ్డాడు.

"రేపే! రేపు ... సాయంత్రం."

"నాకెందుకో భయంగా వుంది కిరణ్ ... మీవాళ్ళు మన పెళ్ళికి ఒప్పుకుంటారో లేదో ..."

"యూ డోంట్ వర్రీ ... వసూ .. నా మాట వాళ్ళు కాదనరు. ఒకవేళ అన్నా .. రిజిస్టర్ మ్యారేజ్ చేసుకుందాం! ఏమంటావ్ ...?"

"ఏమంటాను ... నీలాంటి మంచి ..." ఆ తరువాత ఇక మాట్లాడలేదు. ఆమె తన పెదవుల్తో అతని పెదాల్ని మూసేసింది. ఇన్ని రోజులు ఎందరితోనో తిరిగినా చివరికి కిరణ్ లాంటి మంచి మనసున్నవాడు తనని అర్ధాంగిగా స్వీకరించబోతున్నాడు. ఒకవిధంగా అతన్ని మోసం చేస్తున్నాననే బాధ కూడా వుంది ఆమెలో.

ఆమెకి తెలీదు -

మర్నాడు ఊరికి వెళ్ళే కిరణ్ మళ్ళీ ఎన్నటికీ తిరిగిరాడని ... వచ్చినా ... మామ కూతురు సుమలతతో జంటగా వస్తాడని.

◆


10% డిస్కౌంట్



కైనెటిక్ ఎయిర్ కూలర్

కైనెటిక్ ఎయిర్ కూలర్లు, వాషింగ్ మెషీన్లు, కిచెన్ మెషీన్ల కొనుగోలుపై 10 శాతం తగ్గింపు పొందండి !

పాఠకుని పేరు :..............................

పూర్తి చిరునామా :..............................

..............................

మీ దగ్గరలోని కైనెటిక్ డీలర్‌కి ఈ కూపన్ అందజేయండి



కైనెటిక్ వాషింగ్ మెషీన్

ప్రత్యేక సూచన : ఈ కూపన్ వినియోగించుకున్న ప్రతి 25 మందిలో ఒకరికి లక్కీడిప్ ద్వారా కైనెటిక్ కంపెనీ నుండి సర్‌ప్రైజ్ గిఫ్ట్ అందజేయబడుతుంది. కనుక మీ పూర్తి చిరునామా మరువవద్దు.